శుక్రవారం నిజామాబాద్ అర్బన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా

బీఆర్ఎస్‌ది పేగు బంధం కాంగ్రెస్‌ది ఎన్నికల బంధం

- హనుమంతుడి గుడిలేని ఊరులేదు..
- కేసీఆర్ పథకం చేరని ఇల్లు లేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 20 : తెలంగాణతో కాంగ్రెస్‌కు ఉన్నది ఎన్నికల బంధమేనని.. బీఆర్ఎస్‌ది పేగు బంధమని నిజామాబాద్ అర్బన్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేగు బంధాన్ని తెలంగాణ ప్రజలు కచ్చితంగా ఆదరిస్తారని తెలిపారు. అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మంచి నాయకుడని, ఆయన విజయం ఖాయమని అన్నారు. అయితే భారీ మెజారిటీ కోసమే పని చేయాల్సిన అవసరం ఉన్నదని ఆమె సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాటలు చెప్పే వారిని ప్రజలు నమ్మరని.. పనులు చేసి చూపే వారినే నమ్ముతారని చెప్పారు. బీఆర్ఎస్ సర్కార్ చేసిన అభివృద్ధి గురించి ప్రతి తలుపు, ప్రతి గుండెను తట్టాలని సూచించారు. హనుమంతుడి గుడిలేని ఊరులేదని.. కేసీఆర్ పథకం అందని ఇల్లు లేదని అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను మళ్లీ ఆగం చేయాలనుకుంటున్న ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మాట్లాడుతూ అర్బన్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ కవిత ఉండటం నాయకులు, కార్యకర్తలకు కొండంత బలమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ రక్షణ కవచంలా ఉన్నారని తెలిపారు.

రాహుల్‌వి అబద్ధాల గ్యారెంటీలు

- రేవంత్‌స్క్రిప్ట్‌నే ఆయన చదివారు
- సీఎం కేసీఆర్‌పాలనే శ్రీరామరక్ష
- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం, అక్టోబర్ 20: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణ అభివృద్ధిని విస్మరించి అబద్ధాల గ్యారెంటీలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ సర్కారుపై రాహుల్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాసిచ్చిన స్క్రిప్ట్‌నే చదివారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని కొనియాడారు. శుక్రవారం మంత్రి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. గ్యారెంటీల పేరిట ఉత్తుత్తి హామీలను ఇస్తున్నారని దుయ్యబట్టారు. అరవై ఏండ్లు పాలించి ప్రజలను వంచించిన హస్తం పార్టీని విశ్వసించరని చెప్పారు. ప్రజల కోసం పరితపిస్తున్న సీఎం కేసీఆర్‌నే మరోసారి ఆశీర్వదిస్తారని ఆయన స్పష్టం చేశారు.

బతుకమ్మకు జీవన్‌రెడ్డి అవమానం

- సంస్కారం లేకుండా మాట్లాడుతారా?
- మహిళలకు క్షమాపణ చెప్పాలి
- మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్
- ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

శుక్రవారం తెలంగాణ భవన్ వద్ద జీవన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఇతర మహిళా నాయకురాళ్లు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): బతుకమ్మను అవమాన పరిచేలా మాట్లాడిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. జీవన్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. బతుకమ్మ పండుగకు అసలైన వైభవం తెచ్చింది ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితేనని స్పష్టంచేశారు. మందు బాటిళ్లు పెట్టి బతుకమ్మ ఆడాలనే వ్యాఖ్యలు అభ్యంతరకరమని చెప్పారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఓటమి అని తెలిసే జీవన్‌రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు ఒక్క ఎమ్మెల్సీ కవితనే అవమానపర్చినట్టు కాదని, తెలంగాణ మహిళా సమాజాన్ని అవమానపర్చినట్టని ఆగ్రహం వ్యక్తంచేశారు. బతుకమ్మ పండుగపై కాంగ్రెస్ నాయకులు సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బతుకమ్మలో మందు బాటిళ్లు, సారా బాటిళ్లు పెట్టే సంస్కృతి కాంగ్రెస్ నాయకులకు ఉన్నట్టు ఉన్నదని ఎద్దేవాచేశారు. తెలంగాణ మహిళా సమాజాన్ని, సంస్కృతి, సంప్రదాయాన్ని కాంగ్రెస్ నేతలు అవమానపరుస్తున్నారని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం తెలంగాణభవన్ వద్ద జీవన్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మహిళా నాయకులు దహనం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అవమానించడం సిగ్గు చేటు: రాజీవ్‌సాగర్

ఓటమి భయానికి తోడు వయస్సు మీద పడటంతో జీవన్‌రెడ్డికి మతి భ్రమించి మాట్లాడుతున్నారని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ మండిపడ్డారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మను అవమాన పరిచే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు గౌరమ్మను అమ్మవారి రూపంగా పూజిస్తారని, అలాంటి గౌరమ్మ స్థానంలో లిక్కర్ బాటిల్ పెట్టాలడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. మద్యం మత్తులో ఉండే జీవన్‌రెడ్డికి బతుకమ్మను చూసినా లిక్కరే గుర్తుకొస్తున్నదని పేర్కొన్నారు.

రాహుల్‌ది పర్యాటక యాత్ర

బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఎన్నికల వేళ రాహుల్‌గాంధీ తెలంగాణ పర్యటన పర్యాటక యాత్రలాగా ఉన్నదని బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు చమత్కరించారు. పదేపదే తెలంగాణ ఇచ్చాము అని చెప్పుకొనే కాంగ్రెస్‌కు పది సీట్లు కూడా రావని గుర్తు పెట్టుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణను ఏ పార్టీ ఇవ్వలేదని, రాష్ట్రసాధన ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. తెలంగాణ ఆకాంక్ష కేసీఆర్ పోరాటంతోనే తీరిందని చెప్పారు. తెలుగు రాని రాహుల్.. తెలివి లేని రేవంత్ తెలంగాకుకు అక్కరకు రారని ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్‌ది కుటుంబ పాలన కాదా?

- అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ కాంగ్రెస్ పార్టీ
- రాష్ట్రానికో విధానం.. మ్యానిఫెస్టో ఉంటదా?
- రాహుల్‌పై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్

మోర్తాడ్, అక్టోబర్ 20: రాహుల్ గాంధీ ఎక్కడి నుంచి వచ్చారని, ఆయనది వారసత్వ రాజకీయం కాదా? అని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. తాత జవహర్‌లాల్ నెహ్రూ, నానమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, తల్లి సోనియాగాంధీల పేరు చెప్పుకుంటూ రాజకీయాల్లోకి వచ్చిన రాహుల్ గాంధీ.. కేసీఆర్‌ది కుటుంబపాలన అని మాట్లాడటం ఎంతవరకు వాస్తవమో తెలపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చిన్న విషయాన్ని కూడా గమనించలేని రాహుల్‌ను పప్పు అనడంలో తప్పేమి లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ది జాతీయ పార్టీ అయితే రాష్ట్రానికో విధానం, రాష్ట్రానికో మ్యానిఫెస్టో ఉంటదా అని శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రానికో మ్యానిఫెస్టో ప్రకటించి మోసపూరిత వైఖరిని ఇక్కడే బయటపెట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌వి నెత్తి, కత్తిలేని మాటలని ధ్వజమెత్తారు. ముందు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.4 వేల పింఛన్ ఇచ్చి, తెలంగాణలోనూ ఇస్తామని చెబితే ప్రజలు నమ్ముతారని, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమీ చేయకుండా తెలంగాణలో ఇస్తామని చెబితే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. అవినీతి గురించి కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. ఈ భూమి మీద కాంగ్రెస్ చేయని స్కాం ఏదైనా ఉంటే ఒక్కటి చెప్పాలని, కాంగ్రెస్ అంటేనే అవినీతి, కుంభకోణాలని ఎద్దేవా చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 60 ఏండ్ల కాంగ్రెస్ పాపాలను కడిగామని మంత్రి తెలిపారు. రూ.80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే, లక్ష కోట్ల అవినీతి ఎట్ల జరిగిందో రాహుల్‌గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్.. నోటికొచ్చినట్టు మాట్లాడకు

- ఇసుకపై ఆదాయం 5వేల కోట్లపైనే
- వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- టీఎస్ఎండీసీ చైర్మన్ మన్నె క్రిశాంక్

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హయాంతో పోల్చితే బీఆర్ఎస్ హయాంలో ఇసుకపై ఆదాయం 149% పెరిగిందని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. ములుగు పర్యటనలో కాంగ్రెస్ నేత రాహుల్ ఇసుక విధానంపై చేసిన ఆరోపణలను ఖండించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మాట్లాడేముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో ఇసుకపై 39.66 కోట్ల ఆదాయం సమకూరితే, ప్రస్తుతం ఈ ఆదాయం 5,901.73 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. ఇసుక విధానం సరిగా లేకుంటే లేకపోతే ఇంత ఆదాయం ఎలా వస్తుందని ప్రశ్నించారు. ప్రజలకు ఇసుక దొరకకుండా కాంగ్రెస్ ప్రజలను ఇబ్బంది పెడితే, సీఎం కేసీఆర్ ఇసక కొరత రాకుండా చూసుకున్నారని తెలిపారు. తెలంగాణ ఇసుక విధానంపై కేంద్రం సహా పలు రాష్ట్రాలు ప్రశంసలు కురిపించాయని తెలిపారు. ఇక్కడి ఇసుక విధానంపై ఏడు రాష్ట్రాలు అధ్యయనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే రాహుల్ మాత్రం ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివి నోటికొచ్చిన విమర్శలు చేసి వెళ్లిపోయారని క్రిశాంక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

రూ.286 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఎన్నికల దృష్ట్యా అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీగా నగదు, మద్యం, బంగారం పట్టుబడుతున్నాయి. శుక్రవారం రాత్రి నాటికి మొత్తం రూ.286.74 కోట్ల విలువైన సొమ్మును స్వాధీనం చేసుకొన్నారు. శుక్రవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా రూ.16.56 కోట్ల నగదు పట్టుబడింది. ఇప్పటివరకు రూ.12.21 కోట్ల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు.

రేవంత్ సర్వేలపై విచారించాలి

- సోనియాగాంధీకి గోనె ప్రకాశ్ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): తన వారికి టికెట్లు ఇప్పించుకొనేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ సర్వేలను ప్రభావితం చేశారని, పలుమార్లు ఎన్నికల్లో ఓడిన వారిని గొప్పవారిగా చూపిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు ఆరోపించారు. రేవంత్ అందజేసిన సర్వే రిపోర్టులపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియాకు లేఖ రాశారు. రేవంత్‌రెడ్డి కారణంగా బడుగు, బలహీనవర్గాల నేతలు పార్టీకి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని సూచించారు. తొలి జాబితాలో స్థానం దక్కిన వారిలో 12 మంది కొత్తవారేనని, వీరంతా రేవంత్ అనుచరులేనని తెలిపారు. తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే ఐదుసార్లు ఓడిపోయారని, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారేనని తెలిపారు. అలాంటివారిని అధిష్ఠానం గొప్ప నేతలుగా చూడటం బాధాకరమని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్నవారికి రేవంత్‌రెడ్డి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.

బీజేపీ-జేడీఎస్ పొత్తుకు విజయన్ ఓకే!: దేవెగౌడ

ఖండించిన విజయన్

తిరువనంతపురం, అక్టోబర్ 20: కర్ణాటకలో బీజేపీతో ఎల్డీఎఫ్ కూటమి భాగస్వామిపక్షం జేడీఎస్ పొత్తుకు కేరళ సీఎం విజయన్ అంగీకారం తెలిపారని జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలను విజయన్ ఖండించారు. దేవెగౌడ వ్యాఖ్యలు నిరాధారమని శుక్రవారం స్పష్టంచేశారు. దేవెగౌడ తన వ్యాఖ్యలను సరిదిద్దుకోవాలని సూచించారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, కేరళలో లెఫ్ట్‌ఫ్రంట్‌తో కలిసి బలంగా నిలబడతామని జేడీ(ఎస్) రాష్ట్ర విభాగం స్పష్టం చేసినట్టు విజయన్ వెల్లడించారు.

ఉపాధి బకాయిలపై 31 నాటికి స్పందించకుంటే మళ్లీ ఉద్యమిస్తాం

కోల్‌కతా: ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బకాయిలపై కేంద్రం ఈ నెల 31 నాటికి స్పందించకుంటే ఆందోళనను తిరిగి ప్రారంభిస్తామని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) హెచ్చరించింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ 'కేంద్రం నుంచి పశ్చిమ బెంగాల్‌కు చాలా బకాయిలు రావాల్సి ఉన్నది. ఇందులో ముఖ్యంగా ఉపాధి హామీ బకాయిలు ఉన్నాయి. ఈ నెల చివరినాటికి చూస్తాం. కేంద్రం స్పందిచకుంటే ఆందోళనను తిరిగి ప్రారంభిస్తాం' అని పేర్కొన్నారు.

దేశంలోనే అతి పొడవైన 418 అడుగుల జాతీయ జెండాను పంజాబ్‌లోని అమృతసర్ జిల్లా అట్టారి-వాఘా సరిహద్దులో గురువారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. పతాకంపై భాగాన సర్వేలెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేశారని, దీంతో సమీప సరిహద్దు ప్రాంతంలో జరుగుతున్న కార్యకలాపాలను బీఎస్ఎఫ్ బృందాలు పరిశీలించవచ్చని మంత్రి చెప్పారు.

60 ఏండ్లలో అక్కడ ఒకటి.. 9 ఏండ్లలో ఇక్కడ 21

- రాష్ట్రం ఏర్పడిన 60 ఏండ్లకు నాగాలాండ్‌లో తొలి మెడికల్ కాలేజీ
- ఏండ్లుగా పాలించినా పట్టించుకోని కాంగ్రెస్, ఎన్డీయే ప్రభుత్వాలు
- 9 ఏండ్లలోనే 21 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన కేసీఆర్ ప్రభుత్వం
- 192% పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): 1963లో నాగాలాండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యింది. గడిచిన 60 ఏండ్లలో ఆ రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీ కూడా ప్రారంభంకాలేదు. ఘన చరిత్ర ఉందని చెప్పుకొనే కాంగ్రెస్, తమకు తిరుగేలేదని గప్పాలకుపోయే ఎన్డీయేలు ఆ రాష్ట్రంలో ఏండ్లపాటు అధికారం వెలగబెట్టాయి. అయినప్పటికీ, ఇప్పటివరకూ ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీని తీసుకురాలేకపోయాయి. హక్కుల కార్యకర్తలు, స్థానికుల డిమాండ్‌తో ఎట్టకేలకు రాజధాని కోహిమాలో 100 ఎంబీబీఎస్ సీట్లతో తొలి మెడికల్ కాలేజీ.. నాగాలాండ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ (ఎన్ఐఎంఎస్ఆర్) ఇటీవల ప్రారంభమైంది. అయితే, 60 ఏండ్లలో నాగాలాండ్‌లో ఒక్క మెడికల్ కాలేజీ ప్రారంభమవ్వగా, రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది ఏండ్లలోనే తెలంగాణలో 21 మెడికల్ కాలేజీలు ప్రారంభంకావడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్నది.

ఇదీ తెలంగాణ మాడల్

దేశంలో మరెక్కడాలేని విధంగా

తెలంగాణ ఏర్పడేనాటికి 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. దీంతో సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలోనే నాలుగు మెడికల్ కాలేజీలను స్థాపించారు. కిందటేడాది 8, ఇటీవల మరో తొమ్మిది కాలేజీలను ప్రారంభించారు. మొత్తంగా తొమ్మిదేండ్లలో 21 మెడికల్ కాలేజీల ప్రారంభంతో వీటి సంఖ్య 26కు చేరింది. తొమ్మిదేండ్లలో ఇన్ని మెడికల్ కాలేజీలు తెలంగాణ మినహా దేశంలో మరే రాష్ట్రంలో ప్రారంభం కాకపోవడం గమనార్హం. వచ్చే ఏడాది మరో 8 మెడికల్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. వీటికి సంబంధించి ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు కలిపితే 2014కు ముందు తెలంగాణలో 20 మెడికల్ కాలేజీలు, 2,850 సీట్లు మాత్రమే ఉండేవి. ఈ ఏడాది ఆ సంఖ్య 56కు పెరిగింది. సీట్లు 8,340కు చేరాయి. వచ్చే ఏడాది కోసం ప్రభుత్వం ఇప్పటికే మరో 8 మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. అవి కూడా కలిపితే, సీట్ల సంఖ్య 9,140కి (192 శాతం) చేరుతుంది. వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే ప్రైవేటు కాలేజీలను కూడా కలిపితే రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పదివేలు దాటనున్నది.

తొమ్మిదేండ్లలో తెలంగాణ మెడికల్ కాలేజీల్లో మార్పు ఇది

2014	2023	పెరుగుదల:
5 మెడికల్ కాలేజీలు	26 మెడికల్ కాలేజీలు	420 శాతం

తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు ఇలా..

1946-47 ఉస్మానియా, హైదరాబాద్	1954-55 గాంధీ, హైదరాబాద్	2022-23 మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, సంగారెడ్డి	2023-24 కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయంశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ.
1959-50 కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్	2016-17 మహబూబ్ నగర్, సిద్దిపేట		
2018-19 నల్లగొండ, సూర్యాపేట		2024-25 (రాబోయే కాలేజీలు) జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి.	

రాత్రిపూట నిద్ర తగ్గితే మానసిక ఒత్తిడి

లండన్: రాత్రిపూట తరచుగా 5 గంటల కంటే తక్కువసేపు నిద్రపోవడం వల్ల మానసిక ఒత్తిడి ముప్పు పెరుగుతుందని జన్యుపరమైన అధ్యయనంలో వెల్లడైంది. నిద్ర వ్యవధితోపాటు మానసిక ఒత్తిడికి సంబంధించిన లక్షణాలు ఒక తరం నుంచి మరో తరానికి పాక్షికంగా సంక్రమిస్తాయని లండన్ యూనివర్సిటీ కాలేజీ (యూఎల్‌సీ) పరిశోధకులు తెలిపారు. తక్కువ నిద్ర అనేది మానసిక ఒత్తిడి లక్షణాల ఆగమనంతో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. సగటున 65 ఏండ్ల వయసున్న 7,146 మంది వ్యక్తుల నుంచి సేకరించిన జన్యు, ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించి వీరు ఈ విషయాలను తేల్చారు.

శీతల పానీయాలతో ఎముకలకు నష్టం

లక్నో, అక్టోబర్ 20: నిత్యం శీతల పానీయాలను వినియోగించడం వల్ల ఎముకలు పెళుసుగా మారుతాయని ఆర్థోపెడిక్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. క్రమంగా ఇది 40-50 ఏండ్ల వయసు వారిలో బీఎండీ (బోన్ మెటీరియల్ డెన్సిటీ) తగ్గడలకు దారితీస్తుందని, ఆ తర్వాత అస్థియోపోరోసిస్ (ఎముకలు బోలుగా మారే) వ్యాధిగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. రోజూ శీతల పానీయాలు సేవించడం వల్ల ఎముకల్లో పగుళ్లు ఏర్పడే ముప్పు పెరుగుతుందని, ఇది వయోజనులకు అధికంగా ఉంటుందని కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ షా వలీయుల్లా తెలిపారు. చైనాలో 17 వేల మందికిపైగా వ్యక్తులపై ఏండేండ్లపాటు జరిపిన అధ్యయనంలో ఈ విషయం తేలినట్టు ఆయన వెల్లడించారు.

గాజాపై బాంబుల వర్షం

- సేఫ్ జోన్లపైనా ఇజ్రాయెల్ సైన్యం రాకెట్ దాడులు
- గాజాలో 10లక్షల మందికిపైగా నిరాశ్రయులు
- సరిహద్దుల వద్దే సహాయక ట్రక్కులు

ఖాన్‌యూనిస్(గాజాస్ట్రిప్), అక్టోబర్20: హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ చేపడుతున్న దాడులతో గాజా అల్లకల్లోలంగా మారింది. లక్షలాది మంది పాలస్తీనియన్లు మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్నారు. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకు దాదాపు 10లక్షల మందికిపైగా పాలస్తీనియన్లు శరణార్థులుగా మారారు. దక్షిణ గాజా సురక్షితమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది వేరు. గాజాలో సురక్షితమైన జోన్లు ఏవీ లేవని ఇజ్రాయెల్ మిలటరీ అధికారిక ప్రతినిధి నిర్ దినార్ శుక్రవారం మీడియాతో చెప్పారు. ఇజ్రాయెల్ బాంబు దాడులపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేస్తున్నది. 'దక్షిణ గాజాలో పాలస్తీనియన్లు ఉండలేని పరిస్థితి ఏర్పడింది. గాజా అంతటా ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్నది. ఉత్తర గాజాకు వెళ్లినవారంతా మళ్లీ తిరిగి వెనక్కి వస్తున్నారు' అని ఐరాస మానవ హక్కుల అధికార ప్రతినిధి రవీనా శ్యామ్‌దాసానీ ఆందోళన వ్యక్తం చేశారు.

మానవతా సాయంపై ఐరాస చర్చలు

ప్రపంచ దేశాలు సమకూర్చిన సామగ్రితో కూడిన వాహనాలు ఈజిప్టు-గాజా సరిహద్దులోని రఫా క్రాసింగ్ వద్ద బారులు తీరాయి. దాదాపు 200 ట్రక్కుల్లో 3వేల టన్నులకుపైగా సామాగ్రి అక్కడికి చేరుకున్నట్టు సమాచారం. ఈ ట్రక్కులు శనివారం లేదా ఆ తర్వాత గాజాలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐరాస చీఫ్ ఆంటోనియె గుటెర్రస్ తాజాగా తెలిపారు. సహాయ సామాగ్రి వీలైనంత త్వరగా గాజాకు చేరుకునేలా సంబంధిత వర్గాలతో చర్చలు జరుపుతున్నట్టు ఐరాస మానవతా వ్యవహారాల విభాగం ప్రతినిధి ఒకరు మీడియాతో చెప్పారు. గాజాలోని ఖాన్‌యూనిస్‌లో పిల్లలు, మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో గాయపడుతున్నారు. గాజా దక్షిణ సరిహద్దు వెంబడి వందలాది మందిని అంబులెన్సుల్లో స్థానిక దవాఖానకు తరలిస్తున్నారు. గాజాలో రెండో అతిపెద్ద దవాఖాన అయిన 'నాజర్ హాస్పిటల్' గాయపడ్డవారితో, శరణార్థులతో నిండిపోయింది.

వారు మనిషి రూపంలోని మృగాలు

గాజాస్ట్రిప్‌లోని ఖాన్ యూనిస్‌లో ఇజ్రాయెల్ సైనిక బలగాలు రాకెట్ల వర్షం కురిపిస్తున్నాయి. హమాస్ మిలిటెంట్స్ మనిషి రూపం లో ఉన్న మృగాలని, వీరిని పిట్టల్లా కాల్చిపారేస్తామని ఇజ్రాయెల్ మంత్రి డిచర్ ప్రకటించారు.

ఇజ్రాయెల్‌పైకి హౌతి మిలిటెంట్స్ క్షిపణులు

యెమెన్ తీరం నుంచి ఇరాన్ మద్దతున్న హుతి మిలిటెంట్లు ఇజ్రాయెల్ దిశగా ప్రయోగించిన క్షిపణులను అమెరికా యుద్ధ నౌక కూల్చేసింది. ఈ విషయాన్ని పెంటగాన్ ప్రెస్ సెక్రెటరీ పాట్ రైడర్ వెల్లడించారు. యూఎస్ఎస్ కార్నీ సుమారు మూడు క్షిపణులను గాల్లోనే పేల్చేసిందన్నారు. దీంతోపాటు పలు డ్రోన్లను కూడా హుతి మిలిటెంట్లు ప్రయోగించారని వివరించారు.

సఫాయి కర్మచారులు మరణిస్తే 30 లక్షల పరిహారం: సుప్రీం

న్యూఢిల్లీ: విధి నిర్వహణ సమయంలో సఫాయి కర్మచారులు మరణిస్తే, వారి కుటుంబ సభ్యులకు 30 లక్షల పరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు స్పష్టంచేసింది. శాశ్వత అంగవైకల్యం పొందినవారికి కనీసం రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని తెలిపింది. ఇతర అంగవైకల్యానికి రూ.10 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని చెప్పింది. మాన్యువల్